

భైంసాటౌన్ : కోతుల్‌గాంలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు






# అకాల వర్షం తడిసిన ధాన్యం

ఇచ్చోడ : మల్లాపూర్‌లో ఇంటి పైకప్పు ఎగిరిపోయి తడిసిన సామాగ్రి



## ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం

- ఊడిపోయిన ఇంటిపై కప్పు, రేకులు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



దస్తురాబాద్ : మండల కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు

ఇంద్రవెల్లి/దస్తురాబాద్/ఇచ్చోడ/భైంసా టౌన్, మే 17 : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఫలితంగా ఇండ్ల పైకప్పులు కూలిపోయాయి. రేకులు, రేకుల షెడ్లు నేలమట్టం అయ్యాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాగూడ(జీ), ధర్మాసాగర్ గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ధర్మసాగర్ గ్రామానికి చెందిన గోతి సర్దార్, సాబ్లే జైత్రామ్, సాబ్లే లాల్‌సింగ్, గోతి సైనాబాయి, సాబ్లే సద్ధి, శ్యామ్‌రావ్, నాత్తుసింగ్, రాజేందర్, కార్తార్‌సింగ్‌ల ఇండ్ల పైకప్పులు, రేకులు, రేకుల షెడ్లు నేల మట్టం అయ్యాయి. ఇండ్లలో వర్షపు నీరు చేరడంతో నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులు తడిసి పోయాయి. కేస్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కెస్లాగూడ(జీ) గ్రామానికి చెందిన గంగారాం, మెస్రం లాల్‌షావ్, అమృత్‌రావ్, వెడ్మ బోజ్జులతోపాటు పలువురి ఇంటిపై కప్పుల రేకులు కొట్టుకుపోయాయి. ఆయా గ్రామాల్లో చెట్లు విరిగి పడ్డాయి. దాదాపు 22 విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్లు విద్యుత్ శాఖ మండల ఏఈ జాదవ్ రోహిదాస్ తెలిపారు. వాటికి మరమ్మతులు చేసి, గ్రామాల ప్రజలకు విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈదురుగాలుల వర్షంతో నష్ట పోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### దస్తురాబాద్‌లో..

దస్తురాబాద్ మండల కేంద్రంలో శనివారం వేకువజామున కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసింది. ధాన్యాన్ని ఆరబెట్టే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. తూకం వేసిన బస్తాలను వెంటనే రైసు మిల్లులకు తరలించాలని రైతులు కోరుతున్నారు. తేమ శాతం వచ్చిన తమ ధాన్యాన్ని తూకం వేయడం లేదని ఆరోపిస్తున్నారు. లారీలు కూడా రావడం లేదని పేర్కొన్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాలను సందర్శించి, కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరుతున్నారు.

### ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో..

సిరికొండ మండలంలోని మల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల ధర్మసాగర్ గ్రామంలో రెండు ఇంటి పైకప్పులు ఎగిరిపోయాయి. దీంతో ఇంట్లో సామగ్రి తడిచింది. ఇదే గ్రామంలోని రమేశ్‌కు చెందిన ఎద్దుపై రేకు వచ్చి పడడంతో గాయమైంది. విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి.

### భైంసా మండలంలో..

కొనుగోలు కేంద్రాల్లో అరబెట్టిన ధాన్యం ధాన్యం తడిసింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. నిబంధనల మేర తేమ శాతం ఉన్న హమాలీల కొరత కారణంగా కొనుగోలులో ఆలస్యం అవుతుందన్నారు. కొనుగోళ్లలో ఆలస్యం మూలంగా కష్టపడి పండించిన పంట నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన చెందారు. ఇప్పటికైనా అధికారులు కొనుగోళ్లలో వేగం పెంచాలని కోరుతున్నారు.



కుంటాల కొనుగోలు కేంద్రంలో జొన్నలు, వడ్లపై టార్పాలిన్ కవర్లు కప్పిన రైతులు

ఇచ్చోడ(సిరికొండ): మల్లాపూర్‌లో ఇంటి పైకప్పు పడడంతో గాయపడ్డ ఎద్దు





ఇంద్రవెల్లి : కెస్లాగూడ(జీ)లో విరిగిన చెట్లు

ఇంద్రవెల్లి : ధర్మాసాగర్‌లో ఈదురు గాలులకు లేచిపోయిన ఇంటిపై కప్పు



# పాడి రైతు గోస

- ఆవు పాల ధర తగ్గించిన విజయ డెయిరీ
- లీటర్‌కు రూ.5 తక్కువ
- నష్టపోతున్న రైతులు



ఆదిలాబాద్‌లోని విజయ డెయిరీ

ఆదిలాబాద్, మే 17(నమస్తే తెలంగాణ): పాడి రైతులకు అండగా నిలవాల్సిన రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీ రైతులను నష్టాలకు గురి చేస్తున్నది. పాల డబ్బులు సక్రమంగా చెల్లించకపోవడంతో నష్టాల బారిన పడి అప్పుల పాలు కావాల్సి వస్తున్నది. ఇప్పుడు ఆవు పాల ధరను తగ్గించడంతో రైతుల పరిస్థితి దుర్భరంగా మారనుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పాడి రైతులకు ప్రోత్సాహం అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా గతంలో రైతులకు బ్యాంకు రుణాలపై పాడి పశువులను పంపిణీ చేశారు. కొన్ని రోజుల క్రితం వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3 వేల మంది రైతులు ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీకి రోజు 6 వేల లీటర్ల వరకు పాలను విక్రయించేవారు. ఇందుకు సంబంధించి ప్రతి పక్షం రోజులకు ఒకసారి ప్రభుత్వం పాడి రైతుల డబ్బులను చెల్లించాల్సి ఉండగా నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో రైతులు నష్టపోయారు. బ్యాంకు అప్పులు తీర్చలేక అప్పులు చేయాల్సి వచ్చింది. పాల పైసల బకాయిలు భారీగా పేరుకుపోవడంతో పశువుల నిర్వహణ భారంగా మారింది. దీంతో రైతులు పశువులను విక్రయించి బ్యాంకు అప్పులు కట్టేశారు. దీంతో వారికి ఉపాధి లేకుండా పోయింది.

### ధర తగ్గించడంతో నష్టం

బ్యాంకు రుణాలు తీసుకుని పాడి పశువుల పెంపకం ద్వారా ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీకి పాలను విక్రయించి ఉపాధి పొందుతామని ఊహించిన రైతులకు నిరాశే ఎదురవుతుంది. పశువుల విజయ డెయిరీకి పోసిన పాల పైసలు సరిగా రాక నష్టపోయిన రైతులను ఆవు పాల ధరను డెయిరీ యాజమాన్యం లీటరకు రూ.5 చొప్పున తగ్గించింది. లీటరకు రూ.40 ఉన్న ధరను రూ.35 కు తగ్గించారు. ఆవుల పెంపకంలో భాగంగా పత్తి గింజల పిండి, దాన, పశుగ్రాసం అవసరమవుతుండగా.. వీటి ధరలు బాగా పెరిగిపోయాయి. పశువుల షెడ్లు శుభ్రపర్చడం, పాలు తీయడం, ఇతర పనులకు, కూలీలకు అధిక డబ్బు చెల్లించాల్సి వస్తుంది. రైతులు డెయిరీకి పాలు పోయడానికి ఇష్టపడడం లేదు. దీంతో విజయ డెయిరీ పాల సేకరణ కేంద్రాలు మూతపడుతున్నాయి. హోటళ్లలో తక్కువ ధరకు పాలను విక్రయించి నష్టపోతున్నారు. ఆవుల పెంపకం చేపట్టాలని, పాలను మంచి ధరతో కొనుగోలు చేస్తామని తమ గ్రామాలకు వచ్చి విజయ డెయిరీ అధికారులు చెప్పారని రైతులు పేర్కొంటున్నారు. వారి మాటలు నమ్మి బ్యాంకు రుణాలు తీసుకుని పశువుల పెంపకం చేపట్టినట్లు వాపోయారు. విజయ డెయిరీకి పాలు పోస్తే బిల్లులు సరిగా రాలేదని, ఇప్పుడు ధర తగ్గించడంతో నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

# ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

## నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మే 17 : ఉపాధ్యాయులే సమాజ నిర్మాణానికి మూల స్తంభాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ప్రారంభమైన ఉపాధ్యాయ శిక్షణ తరగతులను శనివారం సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడు ఉత్తమ బోధకుడిగా ఎదిగితేనే విద్యార్థులు విజేతలుగా మారగలరని అన్నారు. బోధన నైపుణ్యాలు మెరుగు పడితేనే పఠన, లెక్కింపు, విశ్లేషణాత్మక ఆలోచన సామర్థ్యాలు పెరుగుతాయన్నారు. పాఠశాల దశ నుంచే విద్యార్థుల్లో లక్ష్య నిర్ధారణ అలవాటు చేయాలని మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన బోధన పద్ధతులను అవలంబించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రామారావు, విద్యాశాఖ అధికారులు నర్సయ్య, లింబాద్రి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

# కడెంను సిద్ధం చేయండి

## ప్రభుత్వ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్



మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్

కడెం, మే 17 : కడెం ప్రాజెక్టును ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, ఎన్డీఆర్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ దామోదర్‌సింగ్, కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధిక వర్షాల వల్ల వచ్చిన వరదల కారణంగా జరిగిన ముప్పు, ఇతర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రానున్న వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు అప్రమత్తత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జూన్ నాటికి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి సిద్ధంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వానికి నివేదికి పంపి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. వారి వెంట ఈఈ విఠల్, తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో అరుణ ఉన్నారు.

### వరద ముప్పు నివారణకు చర్యలు

నిర్మల్ అర్బన్, మే 17 : నిర్మల్ పట్టణంలోని జీఎన్ఆర్ కాలనీలో వర్షపు నీటి వల్ల ఏర్పడే వరద ముప్పును నివారించేందుకు శాశ్వత పరిష్కార చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శనివారం ఆమె రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అర్వింద్ కుమార్, విపత్తు నిర్వహణ విభాగం డిప్యూటీ కమాండర్ దామోదర్‌సింగ్‌తో కలిసి జీఎన్ఆర్ కాలనీలో పర్యటించారు. కాలనీవాసులతో మాట్లాడి వరదల వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. కొంత కాలంగా యేటా వర్షాకాలంలో తీవ్రంగా వరదలు సంభవిస్తున్నాయని, ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు వాపోయారు. అధిక వర్షపాతం వల్ల వరద ముప్పు తలెత్తుతుందని, పరీవాహక ప్రాంతంలో నిర్మించిన చెక్ డ్యాం వల్ల కాలనీలోకి నీరు చేరుతుందని కలెక్టర్ తెలిపారు. చెక్ డ్యాం ఎత్తు తగ్గించేందుకు అనుమతులు లభించాయని, తగిన చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కమిషనర్ జగదీశ్వర్, తహసీల్దార్ రాజు పాల్గొన్నారు.

### ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

ఉట్నూర్, మే 17 : ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్ అన్నారు. శనివారం ఐటీడీఏ పీవో క్యాంప్ కార్యాలయంలో పీవీటీజీ, వరద ముంపు ప్రభావిత ప్రాంతాలపై అధికారులతో సమీక్షించారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, సబ్ కలెక్టర్ రాహుల్ పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

## జిల్లావ్యాప్తంగా వారం రోజుల్లో 15 ఫిర్యాదుల స్వీకరణ

- సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930ని సంప్రదించాలి..
- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, మే 17 : ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను అవలంబించి ప్రజలను మోసగిస్తున్నారని.. ఏపీకే ఫైల్స్, తెలియని వెబ్‌సైట్‌లతో జాగ్రత్తగా ఉండాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఈ మేరకు పోలీస్ ముఖ్య కార్యాలయం నుంచి మాట్లాడారు. వాట్సాప్, టెలిగ్రామ్, సోషల్ మీడియాలో ఏపీకే ఫైల్స్ రావడం ద్వారా మొబైల్ కంట్రోల్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్తుందన్నారు. మోసపోయినట్లయితే వెంటనే(గోల్డెన్ అవర్) జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930, సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ వారం రోజుల్లో 15 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఇందులో సైబర్ క్రైమ్ నేరస్తులు వినియోగిస్తున్న నూతన పద్ధతులు ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్‌సైట్లు, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ వంటి వాటితో జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా యువత మాయమాటలకు నమ్మి మోసపోవద్దని సూచించారు.

### ఇటీవల నమోదైన కొన్ని కేసులు

ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తికి వాట్సప్ ద్వారా బిజినెస్ చేస్తూ, ఇన్వెస్ట్‌మెంట్ చేస్తూ డబ్బులు ఆర్జించవచ్చు. అని తెలిపి టెలిగ్రామ్ ద్వారా బాధితుడికి ఒక లింకును పంపారు. అతను హోటల్స్‌కు రేటింగ్స్ ఇవ్వాలి అని తెలియజేశారని, దానికి నమ్మి దాదాపు రూ.40 వేలు బాధితుడు యూపీఐ ద్వారా చెల్లించాడు.



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

బేల మండలంలోని ఒక ప్రజాధరణ పొందిన ఒక వ్యక్తి పేరిట మీకు ఆర్థిక సహాయం చేస్తామని చెప్పి బాధితుడి వద్ద నుంచి అకౌంట్‌కు సంబంధించిన వివరాలను తీసుకున్నారు. దీంతో బాధితుని వద్ద నుంచి రూ.21 వేలును సైబర్ నేరగాళ్లు తస్కరించారు.

ఆదిలాబాద్ రూరల్ పరిధిలో సామాజిక మాధ్యమంలోని ఇన్‌స్టాగ్రామ్ లో ఒక ఫేక్ అకౌంట్ ని క్రియేట్ చేసి ఆ వ్యక్తి పేరు పై కుటుంబ సభ్యులు, మిత్రులకు శ్రేయోభిలాషులకు వీడియో కాల్స్, మెస్సేజ్‌లు చేస్తూ వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుతో ఇన్‌స్టాగ్రామ్‌కు జిల్లా పోలీసుల తరపున ఫేక్ అకౌంట్‌ను తీసివేయాలని నివేదికను సమర్పించారు.

జైనథ్ మండలంలోని ఒక వ్యక్తికి ముద్ర ఫైనాన్స్ ద్వారా లోన్ వచ్చిందంటూ వీడియో కాల్ చేశారు. బాధితుడు కొంత డబ్బును ముందుగా కట్టాలని తెలిపారు. అతని వద్ద నుంచి దాదాపు రూ.22,150లు తస్కరించారు.

### ప్రైవేట్‌లో ఆరోగ్య భద్రత సేవలు : ఎస్పీ

ఆదిలాబాద్ జిల్లాలో తొలిసారిగా ఆరోగ్య భద్రత సేవలు ప్రైవేట్ ఆస్పత్రిలో ఎస్పీ అఖిల్ మహాజన్ చొరవతో ప్రారంభమయ్యాయి. శనివారం పట్టణంలోని నక్షత్ర ఆస్పత్రిలో నగదు రహిత వైద్య సేవలను ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కాగా ఆస్పత్రి వైద్యుడు సందీప్ ఐత్వార్ ఉచిత వైద్యానికి సంబంధించిన బాండ్‌ను ఎస్పీకి అందించారు. అనంతరం ఎస్పీ ఆస్పత్రిలో అందించే సేవలను అడిగి తెలుసుకుంటూ పరిశీలించారు. ఇక నుంచి పోలీసులతోపాటు వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా ప్రైవేట్ ఆస్పత్రిలో ఆరోగ్య భద్రత కింద ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువ్చామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ బి.సునీల్‌కుమార్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వైద్యులు శిల్ప పాల్గొన్నారు.



నిర్మల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

# హక్కు పత్రాలివ్వాలని ధర్నా

నిర్మల్ చైన్‌గేట్, మే 17 : అటవీ భూముల సాగుదారులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని, స్వాధీనం చేసుకునే చర్యలు మానుకోవాలని కోరుతూ శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఏవోకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంల్) న్యూ డెమాక్రసీ జిల్లా కార్యదర్శి రాజు, జిల్లా నాయకులు కె.సర్దార్, హరిత, అల్లంపల్లి, తదితరులు పాల్గొన్నారు.





